క్లుప్తంగా

రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ..



నెల్లూరు(బృందావనం): ఎల్వీఎం – 3 రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ భక్తవత్సలనగర్‌కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు రంగు రంగుల చొక్కా గుండీలు, కలప ముక్కలతో రాకెట్ నమూనాలను తీర్చిదిద్దారు. 600 చొక్కా గుండీలతో 12 అంగుళాల ఎత్తు, 8 అంగుళాల వెడల్పుతో రాకెట్ నమూనాను రూపొందించారు. కలప ముక్కలతో 2.5 అడుగుల ఎత్తు, 1.5 అడుగుల వెడల్పుతో రాకెట్ నమూనాను తీర్చిదిద్దారు.

యూటీఎఫ్ నేతల నిరసన



డీఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసనను గురువారం చేపట్టారు. అనంతరం డీఈఓ గంగాభవానీకి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, కోశాధికారి మురళీధర్‌రావు, నేతలు వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, ఖాజావలీ, దయాకర్, జమీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సులపై 'జెనెక్స్'లో అవగాహన



నెల్లూరు (టౌన్): నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రామ్ హానర్స్ విత్ సింగిల్ మేజర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని హరనాథపురంలోని జెనెక్స్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీఎస్‌యూ రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి మాట్లాడారు. జాతీయ విద్యావిధానం ద్వారా డిగ్రీ హానర్స్ కోర్సులను విద్యార్థులకు అనుగుణంగా రూపొందించామని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. వర్సిటీ డీన్ విజయ, కళాశాల డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండల్‌రావు, ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలపై సమావేశం



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ కేటగిరీల్లో మంజూరైన టిడ్కో గృహాలను సమాన ప్రక్రియన కేటాయించాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగాధికారి సిద్ధిఖ్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ రావుకు నివాళి



నెల్లూరు (టౌన్): శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు బీఎస్ రావుకు శ్రీచైతన్య జూనియర్ కళాశాల డీన్ శ్రీరామ్, తదితరులు సంతాపం తెలిపారు. ఇస్కాన్ సిటీలోని కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్స్ శ్రీధర్, రాఘవ పాల్గొన్నారు.

ఆపన్న ప్రదీపన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌శర్మ

నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆపన్న ప్రదీపన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నవాబుపేటకు చెందిన పారా శ్రీధర్‌శర్మ నియమితులయ్యారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెల్లాల మధుసూదన్‌శర్మకు కృతజ్ఞతలను తెలియజేశారు.

టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యుల ఎంపిక

నెల్లూరు(బృందావనం): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా సభ్యులను ఎంపిక చేశామని జిల్లా ఆర్గనైజర్ స్వామినాయక్ పేర్కొన్నారు. నగరంలోని టీటీడీ కల్యాణ మండప ప్రాంగణంలో గల హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యాలయంలో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సభ్యులుగా వాకాటి విజయకుమార్‌రెడ్డి, జయరామయ్య, నారేపల్లి రవికుమార్, దగ్గోలు సురేంద్రబాబు, సుధాకర్, సుబ్రహ్మణ్యం, పోలయ్య, జయరామయ్య, మోహన్‌రావు, సూర్యనారాయణ, కో ఆర్డినేటర్‌గా మల్లెల శ్రీహరి వ్యవహరించనున్నారు.

సీఎంకు అండగా నిలవాలి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సంక్షేమ పథకాలు, సేవలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కోరారు. నగరంలోని సత్యనారాయణపురం సెంటర్‌లో 5, 6వ డివిజన్లు, అర్చన థియేటర్ సమీపంలో 45, 46వ డివిజన్లకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పలువురికి ధ్రువీకరణ పత్రాలను అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు గతంలో నెలల పాటు తిరగాల్సి వచ్చేదని, అయితే సచివాలయ వ్యవస్థతో ప్రస్తుతం త్వరితగతిన అందుతున్నాయని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు నగర నియోజకవర్గంలో దాదాపు 20 వేల మందికి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశారని వివరించారు. మైపాడు రోడ్డులో నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి పనులు సెప్టెంబర్ నెలాఖరుకు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఆక్రమణలో ఉన్న వారికి మరో రెండు నెలల్లో ప్రత్యామ్నాయం చూపిస్తామని, ఆ తర్వాతే ఇళ్లను తొలగిస్తామని వివరించారు. ఎన్నికల అనంతరం టీడీపీ నేత నారాయణ పత్తా లేకుండా పోయారని విమర్శించారు. కరోనా సమయంలో నారాయణ హాస్పిటల్లో ఒక్కరికైనా ఉచితంగా సేవలు అందించారానని ప్రశ్నించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఏ రోజైనా తాను న్నానంటూ నారాయణ భరోసా కల్పించారానని పేర్కొన్నారు. తన కోసం కష్టపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు తానెప్పుడూ అండగా ఉన్నానని గుర్తుచేశారు. సీఎం అమలు చేస్తున్న పథకాలకన్నా ఐదు రెట్లు ఎక్కువగా ఇస్తామంటూ ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ సిద్ధమైందని ధ్వజమెత్తారు. కమిషనర్ వికాస్ మర్మత్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, మద్దినేని మస్తానమ్మ, వేలూరు మహేష్, ముదిరెడ్డి వేదవతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రజల మధ్యే ఉన్నా..



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎన్ని కష్టనష్టాలు.. విపత్తులొచ్చినా ప్రజల్లోనే ఉన్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 11వ డివిజన్లో గల యాదవ వీధి, ఎన్టీఆర్‌నగర్ నాలుగో బిట్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయాననే అంశాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి ఆరాతీశారు. అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజల కోసం ఎప్పుడూ పనిచేస్తారని తెలిపారు. కార్పొరేటర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఆత్మకూరు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. రోడ్ల ఆక్రమణలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో పోలీస్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. రోడ్లను ఆక్రమిస్తూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని కమిషనర్ సూచించారు. అనంతరం 19 / 3 హరనాథపురం వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలోని అన్ని రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం అందరికీ చేరువయ్యేలా సచివాలయ సెక్రటరీలు కృషి చేయాలని సూచించారు.

ప్రజలకు మేలు చేయడమే జగనన్న లక్ష్యం



దరఖాస్తులను స్వీకరిస్తున్న గౌరి

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని ఈ నెల 20న నిర్వహించనున్న నేపథ్యంలో డివిజన్లోని ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులను గురువారం ఆమె స్వీకరించారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెంకటరత్నం, రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

భీమిరెడ్డికి అభినందన



నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ క్లాస్ ఫోర్ ఎంప్లాయీస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన భీమిరెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి అభినందించారు. జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ



యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు శిక్షణ

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చే అంశాలపై రికార్డులను పక్కాగా నిర్వహించాలని డీపీఎంఓ హరిశ్చంద్రసతీష్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్, ఈ – సంజీవని, తదితరాలపై యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. డాక్టర్లు అమరేంద్రనాథ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రహ్మేశ్వర్, బాలచందర్, శ్రీనివాసులు, సునీల్, నవీన్, డీపీఓ రమేష్, ఎస్ఓ సహనా, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన రుణాలిప్పించాలి



నెల్లూరు(బారకాసు): పొదుపు గ్రూపులకు సంబంధించిన సభ్యులకు జగనన్న కాలనీల్లో గృహాలకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయించాలని మెప్మా పీడీ రవీంద్ర ఆదేశించారు. సుబేదారుపేట సమీపంలోని మెప్మా కార్యాలయంలో గురువారం నిర్వహించిన రుణ మేళాలో ఆయన మాట్లాడారు. పొదుపు గ్రూపుల్లో సభ్యులై జగనన్న కాలనీల్లో గృహ లబ్ధిదారులకు ఇప్పటికే బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయించామని, మిగిలిన వారికి సైతం త్వరితగతిన అందించేలా చూడాలని చెప్పారు. గృహ లబ్ధిదారులై పొదుపు గ్రూపుల్లో లేని వారిని సీనియర్ గ్రూపులో చేర్పించాలన్నారు. అనంతరం గృహ నిర్మాణాల కోసం 30 మంది మహిళల నుంచి రూ.20 వేల చొప్పున రూ.ఆరు లక్షలను సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. హౌసింగ్ డీఈ దయాకర్, ఏఈ మధు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, టీఈఎస్సెస్ కాంతయ్య, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

16న సంగీత, నృత్యోత్సవం

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సంగీత, నృత్యోత్సవాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నామని గ్రీన్ ఫోర్స్, కృష్ణ కల్చరల్స్ ట్రస్ట్ ఆర్గనైజర్ కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో గురువారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలను 50 మంది కళాకారులు ప్రదర్శించనున్నారని చెప్పారు. పాల్గొనాలనుకునే వారు 89780 59422 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కేతా సుబ్బారావు, చింతా ప్రసాద్, రాయప్ప, రామ్మోహన్‌రావు జనార్దన్, సత్యం, రవి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

నెల్లూరు(పొగతోట): పంచాయతీరాజ్ ఉద్యోగుల 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్కాకుల పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. పీఆర్సీని ఎన్నికల ముందే అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కన్యకాపరమేశ్వరికి శాకంబరి అలంకారం నేడు

నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరి అలంకారంలో శుక్రవారం దర్శనమివ్వనున్నారని నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడారు. ఐదు వేల కిలోల కూరగాయలు, 700 కిలోల ఫలాలతో అలంకరించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

టోల్‌గేట్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కార్పొరేషన్ పరిధిలో టోల్‌గేట్ నిర్మాణాన్ని అడ్డుకుంటామని పలు పార్టీల నేతలు పేర్కొన్నారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో వివిధ పార్టీల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. మేయర్ పొట్లూరు స్రవంతి, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీపీఐ, సీపీఎం, టీడీపీ, జనసేన నేతలు మాలకొండయ్య, అరిగెల నాగేంద్రసాయి, షానవాజ్, రామరాజు, ఆదినారాయణ, నాగేంద్ర, చేజర్ల వెంకటేశ్వర్లు, సుతేష్, అలియా, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ అధికారులకు శిక్షణ

నెల్లూరు(టౌన్): విద్యార్థులకు సైన్స్‌లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గానూ సైన్స్ అధికారులకు పుణెలో శిక్షణ ఇచ్చారు. శిక్షణకు హాజరైన జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడారు. ఈ నెల పది నుంచి 13 వరకు శిక్షణ ఇచ్చారన్నారు. సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కల్పించి, ఆధునిక ఆవిష్కరణలను రూపొందించేలా అవగాహన కల్పించారని తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సక్రమంగా వినియోగించుకొని, ప్రభుత్వ పాఠశాలలను సైన్స్ కేంద్రాలుగా తీర్చిదిద్దే అంశాలపై అవగాహన కల్పించారన్నారు.

మహా ధర్నా జయప్రదానికి పిలుపు

నెల్లూరు(మినీబైపాస్): విజయవాడలో శనివారం నిర్వహించనున్న యూఏపీఏ వ్యతిరేక మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపా రద్దు పోరాట కమిటీ కన్వీనర్ అబ్బాయిరెడ్డి కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు.

ఆలయాభివృద్ధికి తోడ్పాటునందించరూ..

నెల్లూరు(బృందావనం): టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని తిరుమలలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రావు శ్రీనివాసరావు గురువారం కలిశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.2.53 కోట్లు విడుదల కోరుతూ వైవీ సుబ్బారెడ్డి ఆమోదంతో టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు పంపిన విషయాన్ని వివరించారు. ఆలయాభివృద్ధికి స్పందించిన చైర్మన్‌కు ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

వైఎస్సార్సీపీని మరోసారి ఆశీర్వదించండి



సంక్షేమ పథకాలపై బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 12వ డివిజన్లోని చింతారెడ్డిపాళెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తామని వివరించారు. ఆయా ప్రాంతాల అభివృద్ధికి నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికంగా కేటాయించారని చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సమస్యలు పరిష్కరించాలని ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నారాయణరెడ్డి మాట్లాడారు. డీసీసీబీలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కాగా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, శ్రీధర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆ భవనాలను వారంలో కూల్చేయాలి

నెల్లూరు(బారకాసు): పెద్దబజార్‌లో శిథిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉన్న భవనాలను నగర పాలక సంస్థ అధికారులు ఇటీవల గుర్తించారు. ఈ క్రమంలో హెచ్ఎంసీ యాక్ట్ 1955 సెక్షన్ 456 మేరకు ముందస్తు చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారిన ఆయా భవనాలను వారంలోపు కూల్చేయాలంటూ యజమానులకు నోటీసులను జారీ చేశారు. గడువులోపు స్పందించకపోతే తామే కూల్చేస్తామని.. అందుకయ్యే ఖర్చును సంబంధిత భవన యజమానులే భరించాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

మేలు చేయాలనే తపన

వలంటీర్ల సేవాదనం



కరోనా సమయంలో పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ దేవసేన

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరులో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జానా దేవసేన కరోనా సమయంలోనూ విస్తృత సేవలను అందించారు. నలుగురికి మేలు చేయాలనే తపన కలిగిన ఈమె 2019 అక్టోబర్ నుంచి వలంటీర్‌గా పనిచేస్తున్నారు. కరోనా సమయంలో ఏ మాత్రం ప్రాణ భయం లేకుండా పింఛన్లను అందించారు. ఇదే కాకుండా అవసరమైన నిత్యావసర సరుకులు, కూరగాయలను వారి చెంతకు చేర్చారు. తనకు కేటాయించిన గృహాల వారికి పూర్తి స్థాయిలో సేవలను అందిస్తున్నారు.

మాకెంతో సేవ చేసింది

వలంటీర్ దేవసేన మాకెంతో సేవ చేసింది. వైఎస్సార్ పింఛన్ కానుక, పలు పథకాలను క్రమం తప్పకుండా అందిస్తోంది. కరోనా సమయంలోనూ ఎంతో అండగా నిలిచి నిత్యావసర సరుకులు, కూరగాయలను అందించింది. వలంటీర్‌కు రుణపడి ఉంటాం.

– సునీత, సౌత్‌మోపూరు

క్రైమ్ కార్నర్

గంజాయి విక్రేతల అరెస్ట్



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు రూరల్: రైస్ మిల్లులు, రొయ్యల గుంతలు, తదితర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తులను నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని రూరల్ పోలీస్‌స్టేషన్లో గురువారం నిర్వహించిన సమావేశంలో వివరాలను రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఒడిశాకు చెందిన పంకజ్, శరత్ పాండ్యా, ప్రకాష్ నెల్లూరుకు నాలుగేళ్ల క్రితం వచ్చారు. ఒడిశా నుంచి గంజాయిని ఇక్కడికి తరలించి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయాలు చేయసాగారు. దీనిపై పోలీసులు నిఘా ఉంచారు. ఈ క్రమంలో రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్, మహిళా ఎస్సై స్వప్న తమ సిబ్బందితో కలిసి నారాయణరెడ్డిపేట వద్ద దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు.

భార్య, అత్తామామలపై దాడి

నెల్లూరు(క్రైమ్): భార్య, అత్తామామలపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉమ్మారెడ్డిగుంటకు చెందిన అనిత, వెంకటసాయి తేజ దంపతులది ప్రేమ వివాహం. కుమార్తె పుట్టిన నాటి నుంచి భార్యను పట్టించుకోవడాన్ని మానేశారు. రోజూ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడేవారు. పుట్టింటికెళ్లి రూ.రెండు లక్షల కట్నాన్ని తీసుకురావాలంటూ ఇంటి నుంచి భార్యను ఆర్నెల్ల క్రితం తరిమేశారు. అప్పటి నుంచి ఆమె తన పుట్టింట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల తొమ్మిదిన పూటుగా మద్యం సేవించిన వెంకటసాయితేజ భార్య వద్దకొచ్చారు. రూ.రెండు లక్షలు ఇవ్వాలంటూ భార్యపై దాడి చేశారు. అడ్డుకోబోయిన అత్తామామలపై సైతం దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో యువకుల హంగామా

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో యువకులు నానా హంగామా సృష్టించిన ఘటన వెంకటేశ్వరపురంలోని ఇస్లాంపేటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. తన స్నేహితుడి పుట్టిన రోజు సంబరాలు చేయాలనే ఉద్దేశంతో రోడ్డుపై అడ్డుగా బైక్‌లను నిలిపి బ్యాండ్ మేళాల శబ్దాలతో కొందరు యువకులు హంగామా సృష్టించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న వారితో అసభ్యరంగా ప్రవర్తించడంతో స్థానికులు ప్రశ్నించారు. దీంతో వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో నవాబుపేట పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల రాకను గమనించిన యువకులు వారి బైక్‌లను వదిలి పరారయ్యారు. రాత్రి గస్తీ నిమిత్తం జనార్దన్‌రెడ్డికాలనీ, వెంకటేశ్వరపురానికి వచ్చే పోలీస్ మొబైల్ వాహనాన్ని తమ ప్రాంతానికీ పంపేలా చర్యలు చేపట్టాలని ఇస్లాంపేట వాసులు కోరుతున్నారు.